# కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 9వ అధ్యాయము

నేను స్వతంత్రుడను కానా? నేను అపొస్తలుడను కానా? మన ప్రభువైన యేసును నేను చూడలేదా?
ప్రభువునందు నా పనికి ఫలము మీరు కారా? 2 ఇతరులకు నేను అపొస్తలుడను కాకపోయినను మీ
మట్టుకైనను అపొస్తలుడనై యున్నాను. ప్రభువునందు నా అపొస్తలత్వమునకు ముద్రగా ఉన్నవారు మీరే కారా?
3 నన్ను విమర్శించు వారికి నేను చెప్పు సమాధానమిదే – 4 తినుటకును త్రాగుటకును మాకు అధికారము
లేదా? 5 తక్కిన అపొస్తలులవలెను, ప్రభువు యొక్క సహోదరులవలెను, కేఫావలెను విశ్వాసురాలైన భార్యను
వెంటబెట్టుకొని తిరుగుటకు మాకు అధికారము లేదా? 6 మరియు పని చేయకుండుటకు నేనును బర్నబాయు
మాత్రమే అధికారము లేనివారమా? 7 ఎవడైనను తన సొంత ఖర్చు పెట్టుకొని దండులో కొలువు చేయునా?
ద్రాక్షతోట వేసి దాని ఫలము తినని వాడెవడు? మందను కాచి మందపాలు త్రాగనివాడెవడు? 8 ఈ మాటలు
లోకాచారమును బట్టి చెప్పుచున్నానా? ధర్మశాస్త్రము కూడా వీటిని చెప్పుచున్నది గదా? 9 కళ్ళము త్రొక్కుచున్న
యెద్దు మూతికి చిక్కము పెట్టవద్దు అని మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడియున్నది. దేవుడు ఎద్దులకొరకు
విచారించు చున్నాడా?10 కేవలము మనకొరకు దీనిని చెప్పుచున్నాడా? అవును. మనకొరకే గదా ఈ మాటలు
వ్రాయబడెను. ఏలయనగా, దున్నువాడు ఆశతో దున్నవలెను. కళ్ళము త్రొక్కించువాడు పంటలో పాలు
పొందుదునను ఆశతో త్రొక్కింపవలెను. 11 మీరు కొరకు ఆత్మ సంబంధమైనవి మేము విత్తి యుండగా మీ
వలన శరీర సంబంధమైన ఫలములు కోసికొనుట గొప్ప కార్యమా? 12 ఇతరులకు మీపైని ఈ అధికారంలో
పాలు కలిగిన యెడల మాకు ఎక్కువ కలదు గదా? అయితే మేము ఈ అధికారమును వినియోగించు
కొనలేదు. క్రీస్తు సువార్తకు ఏ అభ్యంతరమైనను కలుగజేయకుండుటకై అన్నిటిని సహించు చున్నాము. 13
ఆలయకృత్యములు జరిగించువారు ఆలయమువలన జీవనము చేయుచున్నారనియు, బలిపీఠమునొద్ద
కనిపెట్టుకొని యుండువారు బలిపీఠముతో పాలివారై యున్నారనియు మీరెరుగరా? 14 ఆలాగున సువార్త
ప్రచురించువారు సువార్త వలన జీవింపవలెనని ప్రభువు నియమించి యున్నాడు.

15 నేనైతే వీటిలో దేనినైనను వినియోగించుకొనలేదు మీరు నా యెడల ఈలాగున జరుపవలెనని
ఈ సంగతులను వ్రాయనులేదు. ఎవడైనను నా అతిశయమును నిరర్థకము చేయుట కంటె నాకు మరణమే
మేలు. 16 నేను సువార్తను ప్రకటించుచున్నను నాకు అతిశయ కారణములేదు. సువార్తను ప్రకటింపవలసిన
భారము నా మీద మోపబడియున్నది. అయ్యో! నేను సువార్తను ప్రకటింపక పోయిన యెడల నాకు శ్రమ. 17
ఇది నేనిష్టపడిచేసిన యెడల నాకు జీతము దొరకును. ఇష్టపడక పోయినను గృహనిర్వాహకత్వము నాకు
అప్పగింపబడెను. 18 అట్లయితే నాకు జీతమేమి ? నేను సువార్తను ప్రకటించునప్పుడు సువార్తయందు
నాకున్న అధికారమును పూర్ణముగా వినియోగ పరచుకొనకుండ సువార్తను ఉచితముగా ప్రకటించుటయే నా
జీతము.

### ఆత్మల సంపాదనకైన అపొస్తలుని ఆసక్తి

19 నేను అందరి విషయమై స్వతంత్రుడనై యున్నను, ఎక్కువ మందిని సంపాదించుకొనుటకై,
అందరికిని నన్ను నేనే దాసునిగా చేసికొంటిని.20 యూదులను సంపాదించుకొనుటకు యూదులకు
యూదునివలె ఉంటిని. ధర్మశాస్త్రమునకు లోబడినవారిని సంపాదించు కొనుటకు నేను ధర్మశాస్త్రమునకు

లోబడనివాడను కాక పోయినను, ధర్మశాస్త్రమునకు లోబడని వానివలె ఉంటిని. 21 దేవుని విషయమై ధర్మశాస్త్రము లేనివాడను కాను కాని, క్రీస్తు విషయమై ధర్మశాస్త్రమునకు లోబడినవాడను. అయినను ధర్మశాస్త్రము లేనివారిని సంపాదించుకొనుటకు ధర్మశాస్త్రము లేని వారికి ధర్మశాస్త్రము లేని వాని వలె నుంటిని. 22 బలహీనులను సంపాదించుకొనుటకు బలహీనులకు బలహీనుడనైతిని. ఏ విధముచేతనైనను కొందరిని రక్షింపవలెనని, అందరికి అన్నివిధములవాడనై యున్నాను. 23 మరియు నేను సువార్తలో వారితో పాలివాడనగుటకై దానికొరకే సమస్తమును చేయుచున్నాను.

**జయమునకు ప్రయాసమగత్యము**

24 పందెపురంగమందు పరుగెత్తువారందరు పరుగెత్తుదురు గాని యొక్కడే బహుమానము పొందునని మీకు తెలియదా ? అటువలె మీరు బహుమానము పొందునట్లుగా పరుగెత్తుడి 25 మరియు పందెమందు పోరాడు ప్రతివాడు అన్ని విషయములయందు మితముగా ఉండును. వారు క్షయమగు కిరీటమును పొందుటకును, మనమైతే అక్షయమగు కిరీటమును పొందుటకును మితముగా ఉన్నాము. 26 కాబట్టి నేను గురిచూడనివాని వలె పరుగెత్తువాడను కాను. 27 గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుట లేదు గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనైపోదునేమో అని నా శరీరమును నలుగగొట్టి దానిని లోపరచు కొనుచున్నాను.